క్లుప్తంగా

8నుంచి ఓపెన్‌స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

త్రిపురారం : తెలంగాణ ఓపెన్ స్కూల్ (టీఓఎస్ఎస్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్‌లో పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు ఈనెల 8నుంచి అడ్మిషన్లు ప్రారంభిస్తున్నట్లు చెన్నాయిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ ఉమ్మడి సైదిరెడ్డి, సహాయ కోఆర్డినేటర్ మాలోతు దశరథనాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. చదువును మధ్యలో ఆపేసిన వారు, ఆర్థిక ఇబ్బందులతో రెగ్యులర్‌గా చదువును కొనసాగించలేనివారు ఓపెన్ టెన్త్ తీసుకోవడానికి అవకాశం ఉందని, పదోతరగతి పాస్ అయిన వారు ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్ పొందేందుకు అవకాశం ఉందన్నారు. వివరాలకు 98495 73645, 85559 17912లకు సంప్రదించాలని కోరారు.

పూరిగుడిసె దగ్ధం



దగ్ధమైన గుడిసె వద్ద బాధితులు

పెద్దవూర : ప్రమాదవశాత్తు నిప్పంటుకుని పూరిగుడిసె దగ్ధమైంది. ఈ ఘటన మండలంలోని తెప్పలమడుగు గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తరి రమేష్ కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రమేష్ పనులకు వెళ్లగా ఇంట్లో ఎవరు లేని సమయంలో మధ్యాహ్నం ప్రమాదవశాత్తు పూరిగుడిసెకు నిప్పంటుకొని పూర్తిగా కాలిపోయింది. దీంతో ఇంట్లోని వంట సామగ్రి, క్వింటా బియ్యంతో పాటు దుస్తులు, బైకు, రెండు తులాల బంగారం అగ్నికి ఆహుతయ్యాయి. తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తహసీల్దార్ సరోజకు వినతిపత్రం అందించారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు అధికారి అబీబ్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రజిని

వేములపల్లి : తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిని అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం వేములపల్లి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జయమ్మ, శశికళ, ఏఎన్‌ఎం శైలజ, ఆశా, ప్రేమలత, విఘ్నేశ్వరి, రాధిక, గర్భిణులు, బాలింతలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మాడుగులపల్లి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సూపర్‌వైజర్లు లక్ష్మి, నాగమణి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం చంద్రశేఖర్, సీసీలు సైదులు, స్వాగత్, అంగన్‌వాడీ టీచర్లు సుశీల, మరియమ్మ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శివప్రసాద్

గుర్రంపోడు : మండలంలోని కొప్పోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్ఐ బి.శివప్రసాద్ పాల్గొని మాట్లాడారు. డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు అందరూ సహకరించాలని ఆయన అన్నారు. వాటిని తీసుకునే వారి సమాచారాన్ని 87126 70266 టోల్‌ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలన్నారు.కార్యక్రమంలో హెచ్‌ఎం నోముల యాదగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెడువ్యసనాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసు సిబ్బంది

వేములపల్లి : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని రూరల్ సీఐ వీరబాబు, షీ టీం ఎస్ఐ కోటేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు షీ టీం ఆధ్వర్యంలో మిషన్ పరివర్తన్‌పై అవగాహన కల్పించి మాట్లాడారు. మహిళల, విద్యార్థినుల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శునకాలతో జనం బెంబేలు

- కాలనీలలో గుంపులుగా స్వైరవిహారం
- ప్రజలపై దాడి చేసి గాయపరుస్తున్న వైనం
- శునకాల నియంత్రణకు మున్సిపల్ అధికారుల కార్యాచరణ

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో కుక్కలు స్వైరవిహారం చేస్తుండడంతో ప్రజలను బెంబేలెత్తున్నారు. వృద్ధులు, చిన్నారులు, మహిళలు, పాదాచారులపై కుక్కలు దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. మున్సిపాలిటీలో రాత్రిపూట బయటకు వెళ్లాలంటే జనం జంకుతున్నారు. ఇటీవల కుక్కల దాడులు ఎక్కువ కావడంతో హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. దీంతో నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలను జారీ చేసింది. అయితే కుక్కలను చంపొద్దని చట్టం ఉండటంతో అధికారులు ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది. మరో వైపు ప్రజలు కుక్కలను నియంత్రించాలని కోరుతుండడంతో ఎనిమల్ కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలనే ఆదేశాల మేరకు నల్లగొండ జిల్లా కేంద్రంలో ఎనిమల్ కేర్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. కాని కుక్కలకు కుటుంబ నియంత్రణ చేయాలంటే ఖర్చుతో కూడుకున్న పనికావడంతో జిల్లా కేంద్రంలోని ఎనిమల్ కేర్ సెంటర్ నామ మాత్రంగానే ఉంటుంది.



మిర్యాలగూడ పట్టణంలోని నందిపాడులో కుక్కల స్వైరవిహారం



మిర్యాలగూడ పట్టణంలోని గాంధీనగర్‌లో సంచరిస్తున్న కుక్కలు

నియంత్రణకు మున్సిపల్ శాఖ ప్రత్యేక కార్యాచరణ..

మిర్యాలగూడ మున్సిపాలిటీలో 48వార్డులుండగా 28వేల 104గృహాలున్నాయి. ఆయా వార్డుల్లో మున్సిపల్ అధికారులు 2361వీధి కుక్కలను గుర్తించారు. కానీ ఆయా గృహాల పరిధిలో సుమారు 4661పెంపుడు కుక్కలు ఉండగా, అనధికారికంగా వీధి కుక్కలు మరో వెయ్యి నుంచి 1500 వరకు ఉంటాయని పట్టణ ప్రజల అంచనా. ఈ నేపథ్యంలో కుక్కల బెడద నియంత్రణకు మున్సిపల్ శాఖ ఒక అడుగు ముందుకేసింది. పలు వార్డుల్లో కుక్కలను పట్టుకునేందుకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయనున్నారు. కాగా ఇప్పటికే హైదరాబాద్‌లోని రామంతాపూర్ స్వతంత్ర ఎనిమల్ వెల్ఫేర్ సొసైటీకి జులై 20న మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్‌కు లేఖను పంపించారు.

ఎనిమల్ కేర్ సెంటర్‌కు తరలిస్తాం



మున్సిపాలిటీలో కుక్కల బెడదను నియంత్రించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నాం. హైదరాబాద్‌లోని రామంతాపూర్‌లో స్వతంత్ర ఎనిమల్ వెల్ఫేర్ సొసైటీతో పాటు నల్లగొండలో గల ఎనిమల్ కేర్ సెంటర్‌కు కూడా ఇటీవల సమాచారం అందించాం. కుక్కలను అక్కడికి తరలించి శస్త్ర చికిత్స చేయించేలా చర్యలు తీసుకుంటాం. ఈ వారం రోజుల్లో ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

– మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ కమిషనర్

ఒక్కో శునకానికి రూ.1950 ఖర్చు

ప్రస్తుతం మున్సిపల్ అధికారులు గుర్తించిన 2361కుక్కలకు నల్లగొండలోని ఎనిమల్ కేర్ సెంటర్‌లో స్టిరిలైజేషన్ (కుటుంబ నియంత్రణ), యాంటీర్యాబిస్ ఇంజక్షన్ వేయించేందుకు చర్యలు చేపడుతున్నారు. అయితే ఒక్కో కుక్కకు రూ.1650 చెల్లించాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే కుక్కల సంతతి పెరగకుండా ఉండేందుకు శస్త్రచికిత్స చేయించేందుకు నల్లగొండలోని ఎనిమల్ కేర్ సెంటర్‌ను మున్సిపల్ అధికారులు ఆశ్రయించారు.

వ్యవసాయాన్ని పండుగలా చేయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్

డిండి : వ్యవసాయాన్ని పండుగలా చేయడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. డిండి ఎత్తిపోతల పథకానికి నీటిని తరలించేందుకు నాగర్‌కర్నూల్ జిల్లా పోతిరెడ్డిపల్లి నుంచి వీరబోయనపల్లి వరకు 27 కిలోమీటర్ల దూరం ప్యాకేజీ–1 మెయిన్ కెనాల్ ఏర్పాటులో భాగంగా బుధవారం డిండి మండల పరిధిలోని వీరబోయనపల్లి గ్రామ శివారులో 1.7 కిలోమీటర్ల టన్నెల్ పనులను నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలునాయక్ మాట్లాడుతూ పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతోపాటు డిండి, ఎస్ఎల్‌బీసీలకు సరిపడా నిధులు మంజూరు చేసి రానున్న మూడు సంవత్సరాల కాలవ్యవధిలో పూర్తి చేసి ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగునీరందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా డిండి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నింపి ప్రస్తుతం సాగు అవుతున్న ఆయకట్టు పొలాలకు పంట చివరి దశ వరకు నీరందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ శ్రీధర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాజేష్‌రెడ్డి, దేవేందర్‌రావు, జైపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాఘవేందర్‌రావు, దామోదర్‌రావు, లక్ష్మినాయక్, సాయికుమార్, మేకల కాశన్న, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్, విష్ణువర్ధన్‌రెడ్డి, భగవంతరావు, లింగమయ్య, గిరీష్‌యాదవ్, భద్యానాయక్, బుచ్చిరెడ్డి, మైనొద్దీన్, శైలేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలూనాయక్ పక్కన అచ్చంపేట, కల్వకుర్తి ఎమ్మెల్యేలు

బీఆర్ఎస్ ఆఫీస్ జోలికొస్తే ఊరుకునేది లేదు

నల్లగొండ టూటౌన్: బీఆర్ఎస్ ఆఫీస్ కూల్చివేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పదేపదే అంటున్నారని, ఆఫీస్ జోలికి వస్తే ఊరుకునేది లేదని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన స్థలంలోనే పార్టీ కార్యాలయం నిర్మించామన్నారు. తాము చంద్రబాబు, రేవంత్‌రెడ్డి తొత్తులం కామని, అలాంటి వారికి భయపడే ప్రసక్తి లేదన్నారు. ఉద్యమకారుల జోలికి వచ్చినా, పార్టీ ఆఫీస్ జోలికి వచ్చినా సహించేది లేదన్నారు. కార్యకర్తలను ఇంటి చుట్టూ తిప్పించుకోవాలనే జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నిర్మించుకోలేదన్నారు. వ్యక్తిగత కుట్రలకు ద్వేషాలకు స్వస్తి చెప్పి ప్రజలకు ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ నేతలు దృష్టి సారించాలని సూచించారు. కాంగ్రెస్‌ప పార్టీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ నేతలకు ప్రజా బహిష్కరణ తప్పదన్నారు. సమావేశంలో కనగల్ పీఏసీఎస్ చైర్మన్ తోటి శ్రీనివాస్, లతీఫ్, వెంకటాద్రి, కర్నాటి మల్లేశం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చాడ కిషన్‌రెడ్డి

ప్రతి ఎకరాకు సాగునీటిని అందించాలి

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి, ప్రతి ఎకరాకు సాగునీటిని అందించాలని ఇరిగేషన్ అధికారులను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి కాల్వకు నీటిని విడుదల చేసి సాగుకు నీటిని అందించాలన్నారు. కాల్వల్లో పెరిగిన కంప చెట్లు తొలగించి నీటి ప్ర వాహానికి అడ్డంకి లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ : ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ఎమ్మెల్యేను సన్మానించిన సీపీఎస్ ఉద్యోగులు

మిర్యాలగూడ టౌన్ : ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందిస్తూ నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజల్లో చెరగని ముద్రవేసుకున్న వ్యక్తి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అని తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగవల్లి ఉపేందర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ప్రధానంగా నేనూ నా మిర్యాలగూడ అనే నినాదంతో ముందుకు వెళ్తూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, మత్తుకు యువత బానిస కాకుండా వారిలో చైతన్యం తీసుకరావడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా మహిళా కన్వీనర్ వల్లపుదాసు భూలక్ష్మి, అరుణ, తోట యోగేందర్, చంద్రశేఖర్, సతీష్‌కుమార్, నాగయ్య, రమాదేవి, స్వర్ణలత, మౌనిక, అచ్చాలి తదితరులున్నారు.



మిర్యాలగూడ టౌన్: ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని సన్మానిస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

మానసిక ఒత్తిడిని తగ్గించేందుకే క్రీడలు

- 5వ అదనపు జిల్లా న్యాయమూర్తి వేణు

మిర్యాలగూడ టౌన్ : కోర్టు ఉద్యోగులు, న్యాయవాదులకు మానసిక ఒత్తడిని తగ్గించేందుకు క్రీడలు నిర్వహిస్తున్నట్లు 5వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.వేణు అన్నారు. బుధవారం మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 15 (స్వాతంత్ర్య దినోత్సవం) సందర్భంగా కోర్టు సిబ్బంది, న్యాయవాదులకు స్థానిక బార్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన క్రీడలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, స్నేహ భావాన్ని పెంపొందిస్తాయన్నారు. క్రీడలతో మానసిక ఒత్తిడి నుంచి బయటపడవచ్చన్నారు. ప్రతిఒక్కరిలో పట్టుదల, కృషి ఉంటే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి సుజయ్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వర్ణలత, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి సుమబాల, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి అపూర్వ రవళి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రం రామకృష్ణారెడ్డి, కోశాధికారి ఎం.పవన్‌కుమార్, క్రీడల కార్యదర్శి బాణాల ఉమాశంకర్, జూనియర్, సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



బార్ అసోసియేషన్‌లో క్రీడలను ప్రారంభిస్తున్న న్యాయమూర్తులు

యుద్ధప్రాతిపదికన కాల్వగండిని పూడ్చివేయాలి

- మాజీ ఎమ్మెల్యే నోముల భగత్



గండి పడిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా : అనుముల మండలంలోని మారేపల్లి వద్ద వరద కాల్వకు పడిన గండిని అధికారులు యుద్ధప్రాతిపదిన పూడ్చివేయాలని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. బుధవారం గండిపడిన ప్రదేశాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ వరద కాలువ ద్వారా 80వేల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు 30చెరువులను నింపడానికి లక్ష్యంగా నిర్మించారని అన్నారు. కాల్వకు గండిపడటం దురదుష్టకరమన్నారు. గండిని పూడ్చే పనులు వెంటనే చేపట్టి రైతాంగానికి సాగు, తాగునీరు అందేలా చూడాలన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, నాయకులు మజ్జిగపు వెంకట్రామ్‌రెడ్డి, నర్సిరెడ్డి, సత్తయ్య, ఈదయ్య, అనంద్, శ్రీకాంత్, అంజయ్య, నిడమనూరు మండల అధ్యక్షుడు తాటి సత్యపాల్, మాజీ మార్కెట్ చైర్మన్ కామర్ల జానయ్య, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, మాజీ డైరెక్టర్ సురభి రాంబాబు, రైతులు ఉన్నారు.

వినియోగదారుల హక్కులను కాపాడాలి

నాగార్జునసాగర్ : నాణ్యమైన వస్తువులు అందజేసి వినియోగదారుల హక్కులను కాపాడాలని వినియోగదారుల సంఘాల సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏల వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వినియోగదారుల రక్షణ చట్టం 2019 అమలు చేయడంతో వినియోగదారుల వివాదాల పరిష్కారానికి కమిషన్ పనిచేస్తుందన్నారు. ప్రజలను చైతన్యవంతులను చేయడం కోసం స్థానిక విజయవిహార్‌లో రాష్ట్ర స్థాయిలో ఈనెల 10, 11తేదీల్లో శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో ఆహార పదార్థాల కల్తీని, మొబైల్ ల్యాబరేటరీ ద్వారా తూనికల కొలతలలో ఎలా మోసం చేస్తారనే విధానాన్ని ప్రదర్శించనున్నట్లు, అలాగే రాష్ట్రస్థాయి వినియోగదారుల చట్టంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సంఘాల సమైక్య అధ్యక్షుడు హిమగిరి, సమాచార కేంద్రం కన్వీనర్ చింతమల్ల గురువయ్య, నాగార్జునసాగర్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ కన్వీనర్ కొడుమూరు నారాయణరెడ్డి, మనోహర్, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ రవీంద్రాచారి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను స్వచ్ఛదనం- పచ్చదనంగా మార్చాలి

డిండి : ప్రతి గ్రామాన్ని స్వచ్ఛదనం- పచ్చదనంగా మార్చాలని ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ ప్రజలకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలు మద్దతుగా నిలవాలన్నారు. అనంతరం స్థానిక ఆదర్శ పాఠశాలలో మొక్కలు నాటి నీరు పోశారు. ఆదర్శ పాఠశాలలో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా మండలంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డానియల్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు రాజేష్‌రెడ్డి, సిరాజ్‌ఖాన్, జంగారెడ్డి, బుచ్చిరెడ్డి, మేకల కాశన్న, గడ్డమీది సాయికుమర్, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్, సలయ్య, భీముడునాయక్, ఖాదర్, ఉమర్, రాంసింగ్, గ్రామ కార్యదర్శి జంగయ్య పాల్గొన్నారు.



డిండి : ఆదర్శ పాఠశాలలో మొక్కకు నీరు పోస్తున్న ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్

స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగస్వాములు కావాలి : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గూడూరు, తుంగపాడు గ్రామాల్లో నిర్వహించిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో ఆయన పాల్గొని పారిశుద్ధ్య పనులు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడారు. నియోజకవర్గాన్ని స్వచ్ఛదనంగా- పచ్చదనంగా మార్చేందుకు కృషి చేయాలన్నారు. అదేవిధంగా ప్రస్తుతం వస్తున్న విషజ్వరాలను పూర్తిగా అరికట్టాలని, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. అనంతరం విద్యార్థులకు మొక్కలు నాటడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి

పెద్దఅడిశర్లపల్లి : నాటిన ప్రతిమొక్కనూ సంరక్షించాలని గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు అన్నారు. బుధవారం మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్ వద్ద గల గుడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులున్నారు.



పెద్దవూర కేజీబీవీలో మాట్లాడుతున్న డీటీడీఓ రాజ్‌కుమార్

స్వచ్ఛదనంలో భాగస్వాములు కావాలి

పెద్దవూర : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని డీటీడీఓ రాజ్‌కుమార్, డీఎల్‌పీఓ రాఘవులు అన్నారు. బుధవారం మూడో రోజు శానిటేషన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పిన్నవూర, పెద్దవూర గ్రామాలలో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమాదేవి, మండల వైద్యాధికారి నాగేష్, ఎస్ఓ జోత్స్న, కార్యదర్శి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



పెద్దఅడిశర్లపల్లి : గుడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో మొక్క నాటుతున్న ఎస్ఐ నర్సింహులు



మిర్యాలగూడ : గూడూరులో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



పెద్దవూరలో శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ రాఘవులు

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు ఘన సన్మానం



సన్మానం పొందిన ఉపాధ్యాయులు

మిర్యాలగూడ : దామరచర్ల మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు చందు, పాక ప్రసాద్, శ్రీను, సైదిరెడ్డి, మేరి, హుస్సేన్, సైదిరెడ్డి, మంగమ్మ, పద్మలను బుధవారం పాఠశాలలో హెచ్‌ఎం వీరయ్య ఆధ్వర్యంలో ఎంఈఓ బాలాజీనాయక్ శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బదిలీలు సహజమని వారు ఎక్కడికి వెళ్లినా విద్యార్థుల మనస్సును చూరగొనేలా విద్యాబుద్ధులు నేర్పాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం బి.వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు కౌసల్య, సబిత, శ్యామ్, గణిత పాల్గొన్నారు.

9న వాడవాడలా నిరసనలు

నల్లగొండ టౌన్: కార్పొరేట్లకు అనుకూలంగా బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 9న వాడవాడలా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన సీఐటీయూ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.లక్ష్మీనారాయణ, దబ్బికార్ మల్లేష్, సైదులు, దండంపల్లి సత్తయ్య, చింతపల్లి బయ్యన్న, కానుగు లింగస్వామి, పరిపూర్ణచారి, అద్దంకి నర్సింహ, భీమగాని గణేశ్, సత్యానారాయణ, దయానంద్, బషీర్, ధనుంజయగౌడ్, ముత్యాలు ఉన్నారు.

ఎస్సీ డిక్లరేషన్ అమలు చేయాలని వినతి

మిర్యాలగూడ టౌన్ : కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిక్లరేషన్ తక్షణమే అమలు చేయాలని కోరుతూ బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో డీటీ రామకృష్ణారెడ్డికి బీజేపీ దళిత మోర్చా పట్టణ, మండల కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఎడ్ల రమేష్ మాట్లాడుతూ.. వంద రోజుల్లో కాంగ్రెస్ ఎస్సీ డిక్లరేషన్ అమలు చేస్తామని చెప్పి 8నెలలు అవుతున్నా నేటికీ దాని ఊసే ఎత్తకుండా మాయమాటలతో దళితులను మోసం చేశారని ఆరోపించారు. వినతిపత్రం అందజేసిన వారిలో దళిత మోర్చా జిల్లా కార్యదర్శి మంద శివ, పట్టణ కార్యదర్శి పాతకోటి సైదులు, ప్రభాకర్, రాంబాబు, బంగారి, వెంకటరత్నం పాల్గొన్నారు.



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు